ముందస్తు అరెస్టులు దారుణం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అరెస్టు

విశాలాంధ్ర-రామభద్రపురం: ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయడానికి వెళుతుంటే మార్గ మధ్యంలో రామభద్రపురం కాంప్లెక్స్ వద్ద సిపిఐ నాయకులు అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని జిల్లా సిపిఐ కార్యదర్శి ఓమ్మి రమణ, సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు లు ఆరోపించారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద స్థానిక ఎస్సై సురేందర్ నాయుడు మరియు సిబ్బందితో కలిసి సిపిఐ నాయకులను బలవంతంగా ఉదయం 9 గంటలకుజీపులోకి ఎక్కించి బాడంగి పోలీస్ స్టేషన్ కు తరలించి నాలుగు గంటల పాటు ముఖ్యమంత్రి మీటింగ్ అనంతరం విడిచిపెట్టారు. అనంతరం జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ జిల్లాలో చాలా సమస్యలు ఉన్నాయని వాటన్నింటిని ప్రశ్నించే హక్కు వామపక్ష నాయకులు ఉంటుందని అన్నారు. జిల్లాలో దళిత గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వము తక్షణమే పట్టాలు మంజూరు చేసి గిరిజనుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో ఉన్న రమణ అన్న వలస, జీవనవలస, కృపవలస, సీయన వలస, చిన్న అక్కిన వలస, గ్రామాలకు చెందిన గిరిజనులను గోపాలరాయుడుపేట పంచాయతీలో కలిపి వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రామభద్రపురం మండలంలో వివిధ సర్వే నెంబర్లలో 220 ..1 , 220 ..2 221 ..1 , 222 ..1 222 ..3 218 .2 218 ..3 లోఉన్న ప్రభుత్వ భూములను విశాఖపట్నం మధురవాడ కు చెందిన సాయం సుందర ఈశ్వర రావు ఆక్రమించుకొని సాగు చేస్తుంటే రెవెన్యూ అధికారులు కళ్ళు మూసుకుని ఉండడం చాలా దారుణమని అన్నారు. 15 ఎకరాలు ప్రభుత్వ భూమిపైతక్షణమే సర్వే జరిపి అతని వద్ద నుంచి లాక్కొని ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకోవాలని, లేదంటే భూములేని నిరుపేదలకు పంచి పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో పంచదార మిల్లులు, ఫెర్రో ఎల్లాయి స్, కంపెనీలు, జూట్ మిల్లు మూసివేసారని వాటిని జిల్లా ప్రజా ప్రతినిధులు స్పందించి వాటిని తెరిపించి నిరుద్యోగ యువతకు కార్మికులకు పని కల్పించి ఆదుకోవాలని అన్నారు. ప్రశ్నించే నాయకులను ఈ ప్రభుత్వము ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నాయకులు గొంతులను నొక్కడం చాలా దారుణమని, వీటన్నింటినీ ప్రజలకు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. అలాగే జిల్లాలో ఉన్న భూ సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కారం చేయాలని లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు జరుపుతూనే ఉంటామని హెచ్చరించారు.

అక్రమంగా అరెస్టు చేసిన సిపిఐ నాయకులను తక్షణమే విడుదల చేయాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : జిల్లాకు వస్తున్నటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డిలి గారిని ఈ జిల్లాలో ఉన్నటువంటి సమస్యలు వివరించడానికి వెళుతున్నటువంటి సిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు లను రామభద్రపురంలో అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రభుత్వ పోలీసులు దుర్మార్గమని అరెస్ట్ చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ తో పాటు మరికొంత నాయకులను తక్షణమే విడుదల చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని అక్రమాలస్తులు చేసినంత మాత్రాన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్నటువంటి అన్యాయాలు దాగిపోవని హెచ్చరించారు. వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు దాటుతున్న జిల్లాలో అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడ వేసే చందంగా ఉందని ఇప్పటికీ జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరవలేని . పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేని చేతగాని ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది వైయస్సార్ ప్రభుత్వమే అని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ నాయకత్వం శాంతియుతంగా వినతి పత్రం ఇవ్వడానికి వెళుతున్న సిపిఐ నాయకులను అన్యాయంగా అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు ఎం సూరి ఎస్ జగదీష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున కరెంటు తీగలు

విశాలాంధ్ర-మెరకముడిదాం: సోమలింగాపురం రామయ్యవలస రహదారి పక్కన మోటర్ లైన్ విద్యుత్ తీగలు చేతికందే ఎత్తున కిందకు వేలాడుతూ ఉన్నాయి. వర్షాకాలం కావడం వల్ల రైతులు టాక్టర్ తో దమ్ము పట్టేటప్పుడు టాక్టర్ కు ఆ వైర్ లైన్లు పొరపాటున తగిలితే ప్రాణాలు పోవచ్చు. విద్యుత్ తీగలు విద్యుత్ శాఖ వారు పైకి ఎత్తాలని గ్రామస్తులు కోరుతున్నారు. గర్భం సబ్‌స్టేషన్ పరిధిలోను సోమలింగాపురం సబ్ స్టేషన్ పరిధిలోను గరుగుబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎప్పుడోవేసిన మోటార్ లైన్ వైర్లును క్రిందికి వేలాడుతున్నాయి. రాత్రిపూట వెళ్లేటప్పుడు ఎప్పుడు ఏమి జరుగుతోందో రైతులు బిక్కుబిక్కు అని గడుపు తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు తగు చర్యలు తీసుకుంటారని రైతులు కోరుచున్నారు.

శోభాయమానంగా దర్శనమిచ్చిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

విశాలాంధ్ర-చీపురుపల్లి : మండలంలోని గ్రామ ఇలావేల్పు గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాస సంబరాలు జరిగాయి. శ్రావణ 2వ శుక్రవారం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరుకుమార్, కమిటీ సభ్యులు, ఈ. ఓ. శ్రీనివాస్, ప్రధాన అర్చకులు వారి ఆధ్వర్యంలో శ్రావణ 2వ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి 50,000 గాజులతో అలంకరణ చేసి శ్రావణ గౌరీ గాజుల అలంకారంలో శోభాయమానంగా దర్శనమిస్తున్న ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారు కావున భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు అవుతారని కోరుచున్నాం.

అభివాదానికి అరుదైన చిత్రం

విశాలాంధ్ర-విజయనగరం : గిరిజన విశ్వ విద్యాలయ శంకుస్థాపన సందర్భంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సభలో అరుదైన ఘటన చోటు చేసుకుంది.సభ ముగిసిన తరువాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డివేదిక ముందుకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. సిఎం అభివాదంతో ఒక్క సారిగా ప్రజల నుంచి వ్యక్తమైన హర్షాతిరేకాలను కేంద్రమంత్రి ధరేంద్ర ప్రధాన్ సెల్ లో చిత్రీకరించడం ఆసక్తిగా మారింది.

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సీఎం జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర- శృంగవరపు కోట: సాలూరు నియోజక వర్గంలోని మెంటాడ వద్ద కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం శంఖుస్థాపన కు జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహనరెడ్డి, కేంద్ర విద్యాశాఖామాత్యులు ధర్మేంద్ర ప్రధాన్ ను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు స్థానిక విలేకరులతో ఫోన్లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి తనను కేంద్రమంత్రి ప్రధాన్ కి పరిచయం చేయడం, కొద్దిసేపు వారివురితో మాట్లాడటం జరిగిందన్నారు.

అక్రమంగా అరెస్టు చేసిన సిపిఐ నాయకులను తక్షణమే విడుదల చేయాలి

సిపిఐ ఏరియా కార్యదర్శి మహాదేవ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గజపతినగరం : గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు వస్తున్నటువంటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి జిల్లాలో ఉన్నటువంటి సమస్యలు వివరించడానికి వెళ్తున్నటువంటి సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావులను రాంబద్రపురంలో అక్రమంగా అరెస్టు చేసి బాడంగి పోలీస్ స్టేషన్ కు తరలించడం దుర్మార్గమని అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని గజపతినగరం సిపిఐ ఏరియా కార్యదర్శి మహాదేవ శ్రీనివాసరావు గేదెల రాము నాయుడు లు డిమాండ్ చేశారు శుక్రవారం పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్నటువంటి అన్యాయాలు దాగి పోవని హెచ్చరించారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ నాయకులు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తుండగా నాయకులను అన్యాయంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు.

గిరిజన విశ్వ విద్యాలయం... ఎందరికో ఉపయోగం..

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

గిరిజనులకు రుణపడి వుంటా..సిఎం జగన్మోహన్ రెడ్డి

వర్సిటీ నిర్మాణపనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర విజయనగరం/మెంటాడ/దత్తిరాజేరు : విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలో రూ.834 కోట్లతో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ నిర్మాణ పనులకు కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి , వ్యవస్థాపకత శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. సాలూరు నియోజకవర్గ పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం వద్ద ఏర్పాటు బహిరంగ సభలో విద్యార్థులను, ప్రజలను ఉద్దేశించి వారిరువురు మాట్లాడారు.

గిరిజన సంక్షేమానికి కృషి

కేంద్ర మంత్రి ధరేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మన్యం వీరుడు అల్లూరి పుట్టిన ప్రాంతమని, ఇటీవల విజయవంతమైన చంద్రయాన్ విజయం శ్రీహరికోట నుంచే రావడం సంతోషకరమన్నారు. గిరిజన విశ్వ విద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం 500ఎకరాలు భూమి అందించిందన్నారు. గిరిజన ప్రాంతంలో విశ్వ విద్యాలయం పెట్టడం వల్ల ఒడిషా ఛత్తీస్ గఢ్ లకు ఉపయోగమని ప్రధాని భావించారని తెలిపారు. ఈ విశ్వ విద్యాలయం విద్య సాంకేతిక తదితర అంశాల్లో అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. ఒడిషా విశ్వ విద్యాలయంతో పరస్పరం కలిసి పనిచేయాలని విసి కట్టమణికి కేంద్ర మంత్రి సూచించారు. విశ్వ విద్యాలయం సిక్స్ లైన్ రోడ్లతో అనుసంధానమవుతుందని, ఆక్స్ ఫర్డ్ తో సరి పోల్చే విధంగా రూపొందుతుందన్నారు. గిరిజన విద్య వైద్య తదితర మౌలిక సదుపాయాలకు కోట్లాది రూపాయల కేంద్రం అందిస్తోందని తెలిపారు.

గిరిజనులకు రుణపడి వుంటా : సిఎం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రూ..830 కోట్లతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని మూడు సంవత్సరాలలో ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయబోతున్నామని ప్రకటించారు. తనను గుండెల్లో పెట్టుకున్న గిరిజనులకు రుణపడి వుంటానన్నారు. రాష్ట్రంలో 3 మెడికల్ కాలేజీలు నిర్మాణంలో ఉన్నాయన్నారు.. నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉందని, గిరిజన ప్రాంతానికి గేట్‌వేగా మొట్టమొదట నర్సీపట్నం కనిపిస్తోందన్నారు. పాడేరులో మరో మెడికల్ కాలేజీ, పార్వతీపురంలో మూడో మెడికల్ కాలేజీ నిర్మాణం చేస్తున్నామన్నారు. కురుపాంలో ఒక ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం జరుగుతోందన్నారు. వీటి ద్వారా ఈ ప్రాంతానికి ఎంత మంచి జరుగుతోందో ఆలోచన చేయమని కోరారు. ఎస్టీల కష్టాలు, కన్నీళ్లు తెలిసిన మనిషిగా.. ఎస్టీలకు మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి ఒక్క హామీ అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన తండాల్లో నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చామని,. 2019 జూలై నుంచి ఇప్పటివరకు 4.58 లక్షల గిరిజన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రూ. 410 కోట్లు ఖర్చు చేశామన్నారు.గిరిజన తండాల జనాభా 500 ఉంటే పంచాయతీలుగా మార్పు చేస్తామని చెప్పిన మాట నిలబెట్టుకుంటూ.. ఇప్పటికే 165 గిరిజన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఐటీడీఏ పరిధిలో మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ నిర్మాస్తామని మాట ఇచ్చామని, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, పార్వతీపురంలో, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవం, ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, ప్రకాశం జిల్లా దోర్నాలలో రూ. 250 కోట్లు ఖర్చు చేస్తూ మల్టీ స్పెషాల్టీ హాస్పిటళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు.గిరిజనుల వరకు మాత్రమే చూస్తే 50 నెలల పాలనలో 36.12 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కలిగిస్తూ.. రూ.11,548 కోట్లు డీబీటీ ద్వారా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి పోతోందన్నారు.

గిరిజన సంక్షేమం ధ్యేయం : డిప్యూటీ సిఎం రాజన్న దొర

కార్యక్రమంలో డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర,మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి భూమి నిచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం గిరిజనులు లేని ప్రాంతంలో నిర్మించాలనుకుంది జగన్మోహన్ రెడ్డి గిరిజన నియోజక వర్గంలో విశ్వ విద్యాలయం వుండాలని భావించి కేంద్రంతో మాట్లాడారన్నారు. అమ్మ ఒడి విద్యాదీవెన వంటి కార్యక్రమాలే కాకుండా విద్య వైద్యం పై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.ఎస్టి కమిషన్ సిఎం ఏర్పాటు చేశారనీ, గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి గా అవకాశం కల్పించారన్నారు.

నిర్మాణాత్మక పాత్ర : కలెక్టర్

కలెక్టర్ నాగలక్ష్మి. మాట్లాడుతూ 834 కోట్లు కేంద్రం విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తోందన్నారు. దీనివల్ల 4000 విద్యార్థులకు విద్యావకాశం లభిస్తుందన్నారు. విశ్వ విద్యాలయం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్నారు.

రైలు ఢీకొని జనసేన పార్టీ కొత్తవలస మండల అధ్యక్షుడు నక్కరాజు సతీష్ మృతి

విశాలాంధ్ర-కొత్తవలస: కొత్తవలస జంక్షన్ లో శుక్రవారం చోటుచేసుకున్న రైలు ప్రమాదంలో జనసేన పార్టీ కొత్తవలస మండల అధ్యక్షుడు నక్కరాజు సతీష్ దుర్మరణం చెందాడు. ఉదయం జంక్షన్ లోగల రైల్వే పట్టాలను దాటుతుండగా ఎదురుగా వస్తున్న రైలును గమనించకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు భావిస్తున్నారు. సతీష్ పార్టీ ఆవిర్భావం నుంచి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసారనే మంచి గుర్తింపు జిల్లాలోని నాయకుల్లో ఉంది. పార్టీ అభివృద్ధి, కార్యకర్తలతో మమేకం, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే సతీష్ అకాల మృతితో మండలం ఉలిక్కి పడింది. తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేసి హెూదా కల్పించింది. చిన్న వయసులోనే సతీష్ మృతి చెందడంతో కుటుంభం అయోమయంలో పడింది. మృతుడు సతీష్ కు తల్లి అచ్చియమ్మ, భార్య లక్ష్మితో పాటూ ఇద్దరు కుమారులు ఉన్నారు. సతీష్ మృతి పార్టీకి తీరని లోటని పలువురు జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు రోదిస్తున్నారు. సతీష్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంభ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

గిరిజన యూనివర్సిటీ భూ సేకరణ అవినీతిపై టీడీపీ నిరసన గళం

విశాలాంధ్ర- గజపతి నగరం : గిరిజన యూనివర్సిటీ భూసేకరణలో 265 జీవో ద్వారా భారీ అవినీతి చేసి మోసం చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆరోపించారు శుక్రవారం మధు పాడ గ్రామం వద్ద జాతీయ రహదారిపై శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ జీవో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బొత్స కుటుంబానికి అనుకూలంగా ఉందన్నారు ప్రభుత్వ భూమి కి 37 కోట్ల ప్రజాధనాన్ని వృధా చేశారు అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు లంక సత్యనారాయణ లంక చిన్నం నాయుడు కర్రీ సత్యనారాయణ కర్రీ ఆదినారాయణ గోవింద తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

పట్టణ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 30 వార్డుల పరిధిలో ఉన్న అనేక సమస్యలపై, మరీ ముఖ్యంగా జగన్నాథపురం లో ఉన్న, బేరి వీధిలో చిన్న పాటి వర్షానికే ఆ వీధి రోడ్ పూర్తిగా జలమయం, అవటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలానే ఈ సీజన్లో దోమలబెడద ఎక్కువ ఉండటం వల్ల, క్లోరిన్, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్,ను వాడుతూ దోమల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని, కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి. జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వావిలపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం: సాలూ రు నియోజకవర్గంలో గిరి జన విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని కలిసి ఎమ్మెల్యే జోగారావు పుష్పగుచ్ఛం అందజేసారు. కేంద్రవిద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు సీఎం జగన్ పరిచయం చేశారు.

హడ్కో కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

విశాలాంధ్ర-సీతానగరం: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం సీతానగరం మండల కేంద్రంలోని హడ్కో కాలనీలో ఘనంగా జరిగింది.దివంగత విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ పుచ్చల రామారావు కుమారుడు పుచ్చల నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వైజాగ్ స్టీల్ ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్ కరుణరాజు, జాతీయ మాలమహానాడు అధ్యక్షులు అద్దంకి దయాకర్, విశాఖ దళిత సంఘ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావుల చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు.ర్యాలీగా విచ్చేసిన వారంతా విగ్రహావిష్కరణకు హాజరు కావడంతో పాటు దేశానికి, నిమ్న జాతులకు చేసిన సేవలను కొని యాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత అక్కివరపు మోహనరావు, సర్పంచ్ తేరేజమ్మ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజన పక్షం అంటే ఇదేనా?

- సీఎం జగన్ కు టీడీపీ యువ నాయకులు వైరిచర్ల వీరేష్ సూటి ప్రశ్న

- గిరిజన వర్సిటీని మైదాన ప్రాంతంలో ఏర్పాటు పై విస్మయం

విశాలాంధ్ర-కురుపాం: గిరిజన ప్రాంతానికి తల మానికంగా నిలవాల్సిన కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని మైదాన ప్రాంతంలో ఏర్పాటుకు చర్యలు చేపట్టడాన్ని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ తప్పుబట్టారు. దీనికి సంబంధించి సీఎం జగన్ మెంటాడ మండలంలో శుక్రవారం శంకుస్థాపన చేయడంపై ఆయన స్పందించారు. ఈ మేరకు స్థానిక కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. తాను గిరిజనుల పక్షం అని చెప్పుకొనే జగన్.. గిరిజన వర్సిటీని మైదాన ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. వాస్తవానికి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే కొత్తవలస మండలం రెల్ల గ్రామంలో 500 ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.10 కోట్ల వ్యయంతో చుట్టూ రక్షణగోడ నిర్మించారని గుర్తుచేశారు. అయితే అదే స్థలంలో నిర్మిస్తే టీడీపీకి ప్రతిఫలం దక్కుతుందేమోననే అక్కసు, తమ అనుయాయు లకు ప్రయోజనం చేకూర్చాలనే ఉద్దేశంతోనే స్థలాన్ని మార్పు చేశారని విమర్శించారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన స్థలానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వైసీపీ నాయకుల భూములు ధరలు పెంచడమే దీని వెనుక ఉన్న ఉద్దేశమని ఆరోపించారు. అలాగే కురుపాంలో నిర్మిస్తున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటులో సైతం ఇన్ సైడర్ ట్రేడింగ్ జరిగిందన్నారు. ముందుగా పేదల నుంచి తక్కువ ధరకు భూములు కాజేసి, అనంతరం ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయాలు జరిపారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ చెప్పినట్లు.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన ప్రాంతంలో వర్సిటీని నూతనంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

శభాష్ జోగన్న ...

సీఎం అభినందనలు

చూరగొన్న ఎమ్మెల్యే



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలో గురువారం చంద్రబాబు నాయుడు సభకు ధీటుగా సమా వేశం నిర్వహించి గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం విజయోత్సవ సభను విజయవంతం చేయడంలో ప్రత్యేకతను సంతరించుకోవడంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును అభినందనలతో కొనియాడారు. శుక్రవారం సాలూరు నియోజకవర్గ పరిధిలో, ఉమ్మడి విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం శంఖుస్థాపన కొరకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో కలిసి విచ్చేసిన సీఎం శంఖుస్థాపన చేసిన అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక భేటీలో ముఖ్యమంత్రి ఎమ్మెల్యే ని ఆప్యాయంగా పలకరించి మళ్లీ మనం ప్రత్యేకంగా మాట్లాడుదాం అని చెప్పి, పార్వతీపురంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు నిర్వహించిన చోటే పెద్ద ఎత్తున వైసీపీ పార్టీ సమావేశం నిర్వహించి అత్యంత విజయవంతం చేసిన విశయం అభినందనీయమని ఎమ్మెల్యే బుజం తట్టి అభినందించారు.

ఎన్ని వసతిగృహాలకు అనుమతి ఉందో ప్రకటించాలి

గిరిజన సంక్షేమ సంఘం

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం జిల్లా కేంద్రం సహా మన్యం జిల్లాలో ఎన్ని ప్రయివేటు జూనియర్, డిగ్రీ కళాశాలలకు వసతి గృహాల నిర్వహణకు అనుమతులున్నాయనే విషయం అదికారులు ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబులు కోరారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ప్రైవేటు వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల రక్షణ భాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రధానంగా ఆడ పిల్లల రక్షణ విషయంలో ప్రభుత్వం, అదికారులు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. అనేక ప్రయివేటు కళాశాలలు నిబంధనలు పాటించక పోయిన, కనీసం తరగతులు నిర్వహించకపోగా విద్యార్థులు చదువుతున్నట్లు, అద్యాపకులు చదువు చెబుతున్నట్లు చెప్పుకొని ప్రభుత్వం ఇచ్చే ఫీజులు, స్కాలర్ షిప్పు తీసుకుంటున్నారనే ఉదంతాలపై సమగ్రమైన విచారణ జరిపించాలని కోరారు. ఏ కాలేజీలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు. సబ్జెక్ట్ బోధించే అద్యాపకులు ఎవరనే విషయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

గిరిజన యూనివర్సిటీ గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలి : గిరిజన సంక్షేమ సంఘం

విశాలాంధ్ర-సాలూరు రూరల్: గిరిజన విశ్వ విద్యాలయం సాలూరు గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబా లు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేఖరులతో మాట్లాడారు. నాడు టీడీపీ ప్రభుత్వం,నేడు వైకాపా ప్రభుత్వం విజయనగరం జిల్లాలోని మైదానప్రాంతాలలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాలలో యూనివర్సిటీ నిర్మిస్తే గిరిజన జీవన విధానాలపై, సంక్షేమ, అభివృద్ధి,ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలపై పరిశోధకులు పరిశోధన చేయ టానికి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు వీలుంటుందన్నారు.గిరిజన ప్రాంతంలో కాకుండా మైదాన ప్రాంతంలో శంకుస్థాపన గావించి పార్వతీపురం మన్యం జిల్లా,సాలూరు లో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం అని ప్రచారం చేయడం గిరిజన ప్రజలను తప్పుదోవపట్టించడమేనన్నారు. విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణం పట్ల ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

డ్రోన్ కెమెరా ద్వారా రీ సర్వే వేగవంతం చేయాలి

తాసిల్దార్ సిహెచ్ రాధాకృష్ణ

విశాలాంధ్ర-కొమరాడ : డోన్ కెమెరా ద్వారా మండలంలో రీసర్వే వేగవంతం చేయాలంటూ శుక్రవారం కోనేరు గ్రామం వద్ద డోన్ కెమెరా రాంగ్ ట్రెన్ తాసిల్దార్ సిహెచ్ రాధాకృష్ణ పరిశీలించారు ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న భుహక్కు పథకంలో భాగంగా రి సర్వే ఏకవంతం అవుతుందని మరికొన్ని గ్రామాల్లో ప్రతి పంచాయతీ ఇప్పటికే కొన్ని గ్రామ గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేశామని డోన్ సాకారంతో రిసర్వే ఇంకా వేగం అవుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సర్వే సోమ నాయుడు డోన్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులను మభ్యపెట్టిన జగన్మోహన్‌రెడ్డి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి

విశాలాంధ్ర-సాలూరు రూరల్: తెదేపా ప్రభుత్వం హయాంలో గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి అప్పటి ఉమ్మడి విజయనగరం జిల్లాలో అనువైన స్థలం సేకరించగా ఆ స్థలం మైదానప్రాంతంలో ఉందని పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పిన,తాజా మరియు మాజీ గిరిజన శాఖా మంత్రులు నేడు విజయనగరం జిల్లాలోనే రెండవసారి శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు.శుక్రవారం తెదేపా కేంద్ర కార్యాలయం లో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడిని కలసి గిరిజన యూనివర్సిటీకి రెండవ సారి శంకుస్థాపన గురించి వివరించానన్నారు. సమస్యలను విన్న చంద్రబాబు, గిరిజన విశ్వ విద్యాలయం తెదేపా ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపన జరిగిందని,మరల తెదేపా హయాంలోనే నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారని ఆమె చెప్పారు. కేవలం రెండు కిలోమీటర్ల ప్రయాణం కోసం రెండు సార్లు హెలికాప్టర్ ను వినియోగించడం ప్రజా ధనం దుర్వినియోగం చేయడమేనని చెప్పారు.శంకుస్థాపన నుంచి సభాస్థలానికి చేరుకోవడానికి కూడా రోడ్ మార్గాన ప్రయాణించకుండా హెలికాప్టర్ ను వినియోగించడం విడ్డూరంగా ఉందన్నారు.గిరిజనులకు గత ప్రభుత్వం హయాంలో అందించిన ట్రైకార్ ఋణాలు,ఐటిడిఏ ల నిర్వహణ,బెస్ట్ అవైలబుల్ స్కూల్స్,90శాతం సబ్సిడీ తో వ్యవసాయ పనిముట్లు,ఫీడర్ అంబులెన్స్ లాంటి పథకాలకు ప్రస్తుత ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు.గిరిజనులకు మేలు కలిగే చర్య ఈ నాలుగన్నరేళ్లలో ఒక్కటి కూడా వైకాపా ప్రభుత్వం చేయలేదన్నారు.గతంలో గిరిజనులను మభ్యపెడుతూ వైకాపా లాభపడేదన్నారు.ప్రస్తుతం పాలక ప్రభుత్వం గిరిజనులకు చేస్తున్న అన్యాయాన్ని గిరిజనులందరూ గమనిస్తున్నారన్నారు. శుక్రవారం జరిగిన గిరిజన యూనివర్శిటీ శంకుస్థాపన సభకు గిరిజనులు హాజరుకాలేదన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైకాపాకు బుద్ధి చెప్పడానికి గిరిజనులు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు.

శ్రావణశోభతో ఆకట్టుకున్న అమ్మవార్ల ఆలయాలు

– శ్రీదుర్గాదేవి, శ్రీదారగంగమ్మ, శ్రీకోటమ్మ అమ్మవార్ల ఆలయాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మండలంలో శ్రావణ శోభ అలుముకుంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఎస్.కోట పట్టణంలోని శ్రీదుర్గాదేవి, శ్రీదారగంగమ్మ, మండలంలోని కొట్టాం గ్రామదేవత శ్రీకోటమ్మ అమ్మవార్ల ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. శ్రీవరలక్ష్మి దేవి అలంకారంలో ఉన్న అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. శ్రీదుర్గాదేవి అమ్మవారిని వివిధ రకాల గులాబీలు, చామంతి, బంతి, మందార పూలతో శోభయమానంగా అలంకరించారు. ఆలయాల అర్చకులు హేజీబు రవికుమార్, అగ్నిహోత్రం రాజగోపాలాచార్యులు, గార్లపాటి మూర్తి, సేనాపతి జగన్నాథం తదితరులు శుక్రవారం తెల్లవారుజాము నుండి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల సభ్యులు అమ్మవార్ల దర్శనాలకు విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కాగా శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మహిళలు ఇళ్లలో శ్రీవరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. లక్ష్మీ దేవిని పూలమాలలు, వెండి, బంగారు ఆభరణాలతో సంప్రదాయంగా అలంకరించి ప్రత్యేకంగా తయారు చేసిన 9 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం సేకరణకు మండల స్థాయి కంట్రోల్ రూంలు ఏర్పాటు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో ధాన్యం సేకరణకు మండల స్థాయి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. మండల స్థాయి కంట్రోల్ రూంలో తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి, సి.ఎస్.డి.టి లేదా రెవిన్యూ ఇన్స్పెక్టర్, సబ్ డివిజన్ స్థాయి సహకార అధికారి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఉంటారని ఆయన చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. 2023 – 24 ఖరీఫ్లో ధాన్యం సేకరణ సజావుగా సాగడానికి మండల స్థాయి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మృతిచెందిన గొర్రెలకు నష్ట పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర -సీతానగరం: రెండు రోజుల క్రితం సీతానగరంలో జరిగిన రైల్వేప్రమాదంలో మృతిచెందిన మూగజీవాలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పార్టీ డిమాండు చేస్తున్నట్లు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిలక్షుం నాయుడులు డిమాండ్ చేశారు. పెదభోగిల గ్రామానికి చెందిన గొర్రెలు కాపరులు బొమ్మి అప్పలనాయుడు, నాగళ్ల రాములను శుక్రవారం పరామర్శించారు. సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం సంభవించిన వారిని ఆదుకొనే నాథుడే కరువయ్యాడన్నారు. రెడ్డి లక్షుంనాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కులవృత్తులను నిర్వీర్యం చేస్తున్నాయని, అందులో భాగంగానే మేకలు గొర్రెలు పెంపకం దారులహక్కులను హరిస్తూ వృత్తిదారులకు చేయూతనందించడంలో విఫలమవుతున్నారన్నారు. మూగజీవాలను మేత కొరకు ఆరుబయటకు తీసుకు వెళ్లినప్పుడు రైతులు తమ పొలాల వైపు రావద్దని ఆటంకపరుస్తున్నారని, అలాగే కొండ పోరంబోకులు వైపు తీసుకువెళ్తే అటవీశాఖ అధికారులు ఆటంక పరుస్తున్నారని ఇలా అయితే మూగజీవాలను ఎలా పోషించుకోగలరని ప్రశ్నించారు. మండల కేంద్రంలో ప్రమాదం జరిగిన సంబంధిత పశుసంవర్ధక శాఖ,రెవెన్యూ అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడం చాలా దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన వారికి తక్షణమే ఆర్థికసహాయం అందించాలని వారు కోరారు.

ఎంపికైన వారికి పత్రాలు పంపిణీ

విశాలాంధ్ర-కొమరాడ : శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.మల్లికార్జున చేతులమీదుగా ఎంపికైన గ్రామ వాలంటరీలకు పత్రాలు అందజేయడం ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం మల్లికార్జునరావు పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన మండలంలో ఖాళీగా ఉన్న 8 గ్రామ వాలంటరీ పోస్టులు గాను ఇంటర్వ్యూస్ నిర్వహించమన్నారు అందులో ఆరు గ్రామ వాలంటరీ పోస్టులకు ఎంపికయ్యారు మరో రెండు గ్రామ వాలంటీర్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి ఒకటి గంగిరేగివలస గ్రామపంచాయతీ మరొకటి ఒకటి దుగ్గి గ్రామపంచాయతీ కు ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు, ఈ పంపిణీలో టైపిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన



విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలో పలు ప్రాంతాలలో కమిషనర్ శ్రీరాములు నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా నీటి పంపిణీ, పారిశుద్ధ్యం, పార్కుల నిర్వహణ, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. అక్కడున్న సిబ్బందితో చేపడుతున్న చర్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. నగరంలో మహిళా పార్కును పరిశీలించి మొక్కల సంరక్షణ పట్ల తీసుకుంటున్న చర్యలను గమనించారు. అలాగే నీటి పంపిణీ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. పైప్ లైన్ లీకులను సరిచేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఎక్కడా బురద నీరు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సంపూర్ణ పారిశుద్ధ్యనికి తాము చేస్తున్న కృషికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. రోడ్లపై విచ్చలవిడి అమ్మకాలను ఉపేక్షించుకోమని హెచ్చరించారు. గంట స్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం తదితర జన సమర్థమైన ప్రాంతాలలో చిరు వ్యాపారులు ఇబ్బందికర పరిస్థితుల్లో అమ్మకాలను సాగిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. వీరి వల్ల ప్రధాన రహదారులు చెత్తాచెదారులతో నిండిపోతున్నాయని అలాగే ప్రజలకు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో చిరు వ్యాపారుల అమ్మకాలను క్రమబద్ధీకరించనున్నట్లు చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బురద నీరు సరఫరా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. అందరి సహకారంతో నగర ప్రజల కు మెరుగైన సేవలు అందించేందుకు తాము కృషి చేస్తున్నామని చెప్పారు.

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: మాదకద్రవ్యాల బారినుండి సమాజాన్ని కాపాడి మాదకద్రవ్యాలులేని సమాజాన్ని నిర్మించాలని విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె. కవిత తెలిపారు. శుక్రవారం ఐ.టి.డి.ఎ. గిరిమిత్ర భవనంలో మత్తు పదార్థాల వినియోగం తగ్గింపు,విముక్తి చేయుటకు తీసుకోవలసిన చర్యలుపై జిల్లా అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వశాఖ వారి సౌజన్యంతో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలోనిర్వహించిన ఈ కార్యమంలో మాదకద్రవ్యాలు సమాజం, యువత, ఆర్థిక వ్యవస్థలపై చూపే ప్రభావం పై అవగాహన, మాదక ద్రవ్యాలు చెడు ప్రభావంపై ప్రజలకు అవగా హన కల్పించడంపై శిక్షణఅందించారు. ఈ శిక్షణలో విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె. కవిత మాట్లాడుతూ నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో మాదక ద్రవ్యాలు ఒకటని, యువత వాటి బారిన పడకుండా కాపాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందుకుగాను ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, డ్రగ్స్ ప్రభావిత జిల్లాలలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్ వాడకం వలన సమాజంలో శాంతి భద్రతలు, హింస, లైంగిక దాడులు, వాహన ప్రమాదాలు, ఆత్మహత్యలు సమస్యలు తలెత్తుతాయన్నారు. డగ్స్ వాడకం వలన యువత నిర్వీర్యమై దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడుతుందని కావున డ్రగ్స్ బారిన పడకుండా విద్యార్థులు,యువతను కాపాడాలని తెలిపారు. మత్తుపదార్థాల విముక్తి కార్యక్రమంలో ప్రతి పౌరుని భాగస్వాములని చేయాలని, మత్తు పదార్థాల వినియోగం వలన వచ్చు అనర్థాలపై సమాజంలో ప్రతి ఒక్కరిని అవగాహన కల్పించాలని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. శిక్షణా కార్యక్రమంలో సీడ్ స్వచ్ఛంధ సంస్థ ప్రధాన శిక్షకులు ప్రకాష్ మాదకద్రవ్యాలు బారిన పడకుండా కాపాడటం, వారికి గల సదుపాయాలు, కుటుంబం సభ్యులు సహకారంపై అవగాహన కల్పించారు. దేశంలో నిర్వహించిన సర్వే ప్రకారం 16 కోట్ల మంది మద్యం, 3.1కోట్ల మంది గంజాయి, 2.3 కోట్ల మంది ఇతర మాదకద్రవ్యాలు, 77 లక్షల మంది పెట్రోసంబంధిత ఇన్హేలర్స్ వినియోగిస్తున్నారని, దానివలన సమాజంలో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. మాదకద్రవ్యాలు తయారీ, రవాణా దేశంలో చట్ట విరుద్ధమని, కాని విదేశాలనుండి మన దేశంలోనికి దిగుమతి జరుగుచున్నదని, మాదక ద్రవ్యాలు తీసుకొనే వారికి కౌన్సిలింగు ద్వారా వాటి నుండి దూరం చేయవచ్చునని, అందుకు కుటుంబ సభ్యుల సహకారం కూడా చాలా అవసరమని తెలిపారు. దేశంలో 450 మాదకద్రవ్యాల రిహేబిటేషను కేంద్రాలను కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసారని, వాటిలో ఉచితంగా చికిత్స పొందవచ్చునని తెలిపారు. సీడ్ స్వచ్ఛంధ సంస్థ కో ఆర్డినేటరు రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరంలో మత్తుపదార్థాలకు బానిసైన వారికి వాటి బారినుండి విముక్తి చేయుటకు పునరావాస కేంద్రం నిర్వహిస్తున్నామని, నెలరోజులు ఉచిత వసతి, చికిత్స అందిస్తామని కావున జిల్లాలో మత్తుపదార్థాలకు బానిసలైన వారిని ఈ కేంద్రాలకు తీసుకువచ్చి సేవలు పొందవచ్చునని, చికిత్స అనంతరం కూడా నిరంతరం వారిని పర్యవేక్షిస్తుంటామని తెలిపారు. ఈశిక్షణా కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.భాస్కరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయగౌరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయితీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

– పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు ర్యాలీ, మానవహారం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని, ప్రస్తుత వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు భారీ ర్యాలీ నిర్వహించడంతో పాటు ఎస్.కోట దేవి జంక్షన్ వద్ద శుక్రవారం మానవహారం నిర్వహించి మోకాళ్ళపై కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ 2015 లోను 2023 జులై 23న హైకోర్ట్ తీర్పులను అమలుచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రం చేసి పర్యావరణ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న గ్రామ పంచాయితీ కార్మికులు, గ్రీను అంబాసిడర్స్, గ్రీన్ గార్డు టైం స్కేల్ వర్కర్స్కు పెండింగ్ లో ఉన్న బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, కనీస వేతనాలు పెంచాలని, టెండర్స్ రద్దు చేయాలని, గుర్తింపు కార్డులు, పి.ఎఫ్. ఈ.ఎస్.ఐ గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా గ్రామ పంచాయితీ కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దల తరబడి కార్మికులు శ్రమ దోపిడీకి గురౌతునే వున్నారన్నారు. 1999లో నాటి ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన 551 జీఓ ప్రకారం కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనం పి.ఎఫ్.ఈ.ఎస్.ఐ అమలు చేయాల్సి ఉందన్నారు. కానీ ఇవేవి నేటికి అమలు చేయడం లేదని, 2015లో హైకోర్ట్ ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తు టెండర్లు విదానం మాత్రం కార్మికులపైన బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. ప్రతి నెలా 5వ తేది లోపు జీతాలు చెల్లించాలని 2019 ఫిబ్రవరిలో జారీ చేసిన జీఓ ఎం.ఎస్.నెం. 132 స్పష్టంగా పేర్కొంటున్నదని, కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదని స్పష్టం చేశారు. కార్మికులకు 2 నుండి 18 నెలల జీతాలు బకాయిలు వున్నాయని, జీతాలు అందక కార్మికుల కుటుంబాలు పస్తులతో బ్రతుకుతున్నారని తెలిపారు. తమ బాధలు చెప్పుకోవడానికి ప్రభుత్వ ఆఫీసులకు వెళ్తే వినే నాథుడే లేరని, ధరలు పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచడం లేదన్నారు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18000/- లు జీతం చెల్లిస్తామని హామి ఇచ్చారు. ఆ హామిని అమలు చేయలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం చేయాలని సమాన పనికి సమాన వేతనం సుప్రీమ్ కోర్ట్ తీర్పును అమలు చేయాలి. తొలగించిన కార్మికులను యధావిదిగా కొనసాగించాలి. జీఓ.నెం. 680 ప్రకారం గ్రీన్ అంబాసిడర్లకు గ్రీన్ గార్డకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ. 10000/- జీతం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. అనంతరం కార్మికులతో కలిసి తహశీల్దార్ డి.శ్రీనివాసరావుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నేతలు డి.శ్రీను, సీహెచ్.ముత్యాలు, సీహెచ్.అప్పారావు, సీహెచ్.రాము, బి.గంగరాజు, సోములు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పై

30 నుండి సెప్టెంబర్ 4 వరకు ప్రజా సమరభేరి

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. సుబ్బరావమ్మ శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో బాగంగా ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా సమరభేరి కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, గ్యాస్ ధర మోడీ అధికారం లోకి వచ్చినప్పుడు రూ.400 వుంటే ఇప్పుడు రూ.1200 అయిందని, రూ.70 రూపాయిలున్న పెట్రోల్ ధర రూ.112 రూపాయిలకు పెరిగిందని, పప్పులు, వుప్పులు, నూనెలు ధరలు విపరీతంగా పెరిగాయని, కూరగాయలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు, టమాటా ధర రూ.200 కు పెరిగిందన్నారు అలాగే మోడీ వచ్చిన తర్వాత నిరుద్యోగం పెరిగిందని 2014లో సంవత్సరానికి 2.కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోడీ అమలు చేయలేదని ఉపాధిలో బంగ్లాదేశ్ కంటే వెనుకబడి మన దేశం వుందన్నారు. దేశంలో మతతత్వాన్ని పెంచుతుందని, మణిపూర్ లో అల్లర్లు సృష్టించారని మహిళలను నగ్నంగా ఊరేగించి హత్యాచారం చేస్తే కనీసం బిజెపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 72 రోజుల వరకు స్పందించ లేదని, ఆ తరువాత హర్యానా లో మత అల్లర్లు సృష్టించారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు కారుచౌకగా అప్పజెబుతుందని, ప్రకృతి సంపదను కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఇస్తున్నారన్నారు. మన రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, స్టీల్ ప్లాంట్ ను అమ్మేస్తున్నారని అన్నారు. ఇంత ద్రోహం దేశానికి, రాష్ట్రానికి బిజెపి చేస్తుంటే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మూకుమ్మడిగా బిజెపికి మద్దతిస్తున్నారని, జగన్మోహన్ రెడ్డి జిల్లాలో ఉన్న అనేక సమస్యలను పరిష్కారం చేయాలని పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం పూర్తిచేయాలని, గిరిజన ప్రాంతంలో ఉన్న రోడ్లు వేయాలని, ఏనుగులు ఇతర ప్రాంతానికి తరలించాలని, గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని, గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని, జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల కాలువలు మరమ్మత్తులు చేసి చివరి భూములకు నీరందించాలని డిమాండ్ చేశారు ఈ విధానాలపై సమర భేరిలో ప్రచారం చేసి సచివాలయాల వద్ద, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, ఎం. తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు

విశాలాంధ్ర-మెంటాడ/దత్తిరాజేరు : గిరిజన విశ్వ విద్యాలయ శంకుస్థాపన సందర్భంగా సభా ప్రాంగణం వేదికపై కళాకారుల ,చిన్నారులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రజలు,అధికారులు,ప్రజా ప్రతినిధుల ప్రశంసలందుకున్నాయి.గిరిజన సంప్రదాయ వస్త్రధారణతో పాటకు తగిన లయాత్మక నృత్యంతో అందరినీ ఆకట్టుకున్నారు.



తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు

– ఎస్.కోట నియోజవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీతోనే ఆంధ్ర ప్రజల భవిష్యత్తుకి గ్యారెంటీ అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి అన్నారు. ఎస్.కోట పట్టణం, 4వ వార్డులో మహాశక్తి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మహిళలు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాశక్తి పథకం కింద 18 ఏళ్లు నిండిన స్త్రీకి ఆడబిడ్డ నిధి కింద నెలకు 1500 రూపాయలు, తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15వేల రూపాయలు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్లు లేని ప్రయాణం, అన్నదాత పథకం కింద ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం, బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాల అండగా నిలుస్తాము, ఇంటింటికి మంచినీరు పథకం కింద ప్రతి ఇంటికి కులాయి కనెక్షన్, పూర్ టు రిచ్ ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు పేదలను సంపన్నులను చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంతు, చాందిని, కృపా, సంధ్య, లక్ష్మీ, అప్పలనర్స, చిన్నమ్మలు, సన్యాసమ్మ, జడ్పీటీసీ అభ్యర్థి బీశెట్టి అరుణ, మాజీ ఎంపీటీసీ గొర్లె కన్నతల్లి, దేవుపల్లి ప్రభ, గనివాడ లక్ష్మి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు గన్ను బంగారమ్మ, వార్డు మెంబర్లు పెదగాడ లక్ష్మి, గుడుపు నాగమణి, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, ఉపాధ్యక్షులు సరిపల్లి రామకృష్ణ, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, ఎస్.కోట గ్రామ కమిటీ అధ్యక్షులు కొనదం మల్లేశ్వరరావు, విశాఖ టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాపుగంటి శ్రీనివాసరావు, ఐటీడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, ఎస్.కోట గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), ఐటీడిపి నియోజకవర్గ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వాకడ బాల ఈశ్వర్ భరత్ (బాలు) తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లైన్ల రోడ్డుకు భూసర్వే

మండల సర్వేయర్ అప్పలనాయుడు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని పాటూరు గ్రామ రెవెన్యూలో నాలుగు లైన్ల రోడ్డునకు భూ సర్వే చేయడం జరుగుతుందని మండల సర్వేయర్ గరుగుబిల్లి అప్పలనాయుడు అన్నారు. విశాఖ నుండి పెందుర్తి, కొత్తవలస శృంగవరపుకోట మీదుగా బొడ్డవర వరకు నాలుగు లైన్ల రోడ్డు ప్రతిపాదన కావడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పాటూరు బొద్దాం గ్రామాల సమీపాలలో సర్వే చేయడం జరుగుతుందని. ఈ సర్వేలో ఎంత మేర విస్తీర్ణం ఎంతమంది రైతులకు సంబంధించి భూమి కలుస్తున్నదన్నది గుర్తించడం జరుగుతుందని అలాగే ఈ నివేదికను జిల్లా అధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు బాలరాజు సంతోష్ వీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు..

గడప గడపలో జోనల్ ఇన్‌ఛార్జి పథకాల అమలుపై ఆరా

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 43వ డివిజన్ 52వ సచివాలయ పరిధిలో ఉడా కాలనీ నుండి అయ్యన్న పేట వెళ్లే మార్గంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళుతూ ప్రభుత్వ పథకాల పనితీరు, లబ్దిదారులకు అవి ఎంతవరకు నేరుగా చేరువవుతన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారా ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందిస్తుంన్నందుకు ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశామన్నారు.అదే విధంగా మౌలిక వసతుల సదుపాయంలో కూడా 80 శాతం మేర పూర్తి చేశామని...ఈ అభివృద్ధికి అండగా నిలిచిన స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి మరలా గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లందరు ఐక్యతతో క్రీస్తు ప్రేమను సమాజానికి చాటిచెప్పాలి

జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటి నియామకం



విశాలాంధ్ర-కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటి నియామకం ఘనంగా జరిగిందనీ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బిషప్. ఎస్. తిమోతి తెలియచేశారు. స్థానిక పట్టణ సమీపంలో వున్న జంజావతి గ్రామం, ఎస్.టి.సి.చర్చ్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యమంలో ఎ.పి. స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అడిషనల్ సెక్రెటరీ డా. పి. ప్రేమానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో డా. డి.ఎస్.వి.ఎన్. కుమార్ దైవ సందేశం లో మాట్లాడుతూ జిల్లా లో వున్న పాస్టర్లందరు ఐక్యత కలిగి క్రీస్తు ప్రేమను సమాజానికి చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనిన ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్. కె.ప్రతాప్ సిన్హా గారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మణ్యం జిల్లా లో వున్న పాస్టర్స్ ఫెలోషిప్ వారు జిల్లా లో వున్న క్రైస్తవ సమాజము లో వున్న సమస్యలపై దృష్టి పెట్టి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసికొని వెళ్లి సమస్యలను పరిష్కరించాలి అని ఆదేశించారు. ఇందు నిమిత్తమే ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ ద్వారా జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని నియమించామని తెలియచేశారు. కార్యక్రమంలో 55 మంది పాస్టర్స్ పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

డిఐఓ డాక్టర్ టి జగన్మోహన్‌రావు

విశాలాంధ్ర-కొమరాడ : రోగ నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించి, డిఐఓ డాక్టర్ టి జగన్మోహన్రావు ప్రజలు సీజనల్ రోగాలబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు, అన్నారు. శుక్రవారం చంద్రంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా అని సిబ్బందిని ఆరా తీశారు. ఒపి రికార్డు లో వివిధ అనారోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి చేపట్టిన ఆరోగ్య తనిఖీలు,పరీక్షలు పరిశీలించారు. జ్వర నిర్ధారణ పరీక్షలకు ఉపయోగిస్తున్న కిట్లు, స్లైడ్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలను గుర్తిస్తే లక్షణాలను అనుసరించి వెంటనే మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని,సీజనల్ వ్యాదులు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యల్లో బాగంగా డ్రై డే కార్యక్రమాలు,స్ప్రేయింగ్ పూర్తి స్థాయిలో నిర్వహించి ప్రజలు రోగాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. అనంతరం గర్భిణీల ఆరోగ్య తనిఖీల కార్డుల ను పరిశీలించి ప్రతినెలా నమోదు చేస్తున్న హీమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్ .సాహితి, డెమో వై. యోగీశ్వరరెడ్డి, సూపర్ వైజర్ జయగౌడ్,వైద్య సిబ్బంది ప్రమీల,అనూష,రామకృష్ణ,104 సిబ్బంది జగదీష్,దుర్గారావు,ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక అలంకరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయాలకు శ్రావణమాసశుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సందర్భంగా చదురు, వనం గుడిలు వద్ద ప్రత్యేక అలంకరణ నిర్వహించి వివిధ నైవేద్యాలు సమర్పించారు .అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులంతా అధిక సంఖ్యలో ఉదయం నుండే దేవాలయం వద్దకు విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు నిర్వహించుకున్నారు. ఆలయ అర్చకులు, బంటుపల్లి వెంకటరావు, ఏడిద వెంకటరమణ, మూలపాపారావు లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనంగుడి గుడి వద్ద అమ్మవారు వరలక్ష్మి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయప్రాంగణంలో మహిళలు సామూహికంగా వ్రతాలు ఆచరించుటకున్నారు.ఆలయాల ప్రాంగణాలు విద్యుదీప కాంతులతో శోభాయమానంగా వెలుగొందాయి.దేవస్థానం భక్తులసౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

దొరికిన సెల్‌ఫోన్ ను బాధితులకి అందజేసిన ఆర్టీసీ అధికారులు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బాలకృష్ణ అనే ప్రయాణికుడు విజయనగరం నుంచి పార్వతిపురం మన్యం ప్రయాణం చేయగా తమ ప్రయాణంలో తమ వద్ద ఉన్న 20,000 విలువచేసే మొబైల్ ఫోన్ బస్సులోని మరిచిపోయి బస్సు దిగిపోయారు, ఆ మొబైల్ ఫోన్ బస్సులో ప్రయాణం చేసే ప్రయాణకురాలు గుర్తించి , సదరు డిపో స్టేషన్ మేనేజర్ కి మొబైల్ ఫోన్ అందజేశారు, సదరు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న పాసింజర్ వచ్చి అడగగా అతని వివరాలు తెలుసుకుని బాధితుడికి మొబైల్ ఫోన్ ఇవ్వడం జరిగింది. ఎంతో విలువైన మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వడంతో ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ పి సత్యనారాయణ కానిస్టేబుల్ బి ఎన్ రావు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన జెడ్పీ ఛైర్మన్ మజ్జి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు దుల్ల అప్పన్న కుమార్తె వివాహ మహోత్సవం గురువారం వైభవంగా జరగగా, శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు,డిసిసిబి చైర్మన్ వి.వి చిన రాము నాయుడు,మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు,వైస్ ఎంపీపీ ఈశ్వరరావు,మండల పార్టీ అధ్యక్షుడు జగ్గు బాబు,జెసిఎస్ మండల ఇంచార్జ్ భోజంకి శ్రీను,మండలంలోని అయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వధూవరులకు ఎమ్మెల్సీ రఘురాజు దీవెనలు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కరకవలస గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు దుల్ల అప్పన్న కుమార్తె వివాహం సందర్భంగా శుక్రవారం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సుధారాణి దంపతులు, నూతన వధూవరులను వధూవరులను సుఖ సంతోషాలతో జీవించాలని తమ దీవెనలతో ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్.కోట జడ్పిటిసి ముమ్ములూరి వెంకటలక్ష్మి, ఎంపీపీ సండి సోమేశ్వర రావు ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి, సీఎం జగన్ కు ఘన స్వాగతం

డిసిసిబి చైర్మన్ వేచలపు

విశాలాంధ్ర-వేపాడ: జిల్లాలోని మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో నూతనంగా ఏర్పాటు కానున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంఖుస్థాపనకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డికి శుక్రవారం డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామనాయుడు ఘన స్వాగతం పలికి మర్యాదపూర్వకముగా కలిసారు. ఈ సందర్భముగా, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడుని కేంద్రమంత్రివర్యులకు పరిచయం చేసారు.

పోలీస్ సేవలు భేష్

విశాలాంధ్ర-విజయనగరం : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ మెంటాడ మండలం చిన మేడపల్లి గ్రామంలోని శంఖుస్థాపన కార్యక్రమం వద్ద, మరడాం గ్రామంలోని సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను జిల్లా కలెక్టరు శ్రీమతి ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ ఎం.దీపిక స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు అస్మా ఫర్హీన్, అనిల్ పులిపాటి, మణికంఠ, పలువురు డీఎస్పీలు, సిఐలు, ఎసైలు, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కు బొబ్బిలి వీణ బహుకరిస్తున్న సిఎం

సిఎం జగన్మోహన్ రెడ్డికి నంది. బహుకరిస్తున్న గిరిజన విశ్వ విద్యాలయ విసి కట్టమణి

కేంద్ర మంత్రికి పూర్ణ కుంభ స్వాగతం

ముఖ్యమంత్రి తో మహిళా నేతలు

సిఎంతో జిల్లా నేతలు

సిఎం జగన్మోహన్ రెడ్డికి ప్లకార్డులతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు అభిమానులు

రైతులకు మేలు జరిగేలా సలహాలు అందించాలి

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రతిరైతు ఇ-కెవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: వ్యవసాయ సలహా మండలిలో రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ సలహామండల చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వ పథకాలు, ప్రకృతి వైపరీత్యాలలో నష్టపరిహారంపొందుటకు, పంటను అమ్ముకొనుటకు ప్రతిరైతు తప్పని సరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల స్థాయి, మండల స్థాయి సలహా మండలి సమావేశాలకు సంబంధిత శాఖల అదికారులు హాజరుకావాలన్నారు. జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం వరి పంట కొనుగోలుకు లక్ష్యం లేదని రైతు పండించే ప్రతి గింజ కొనుగోలు చేస్తామని, రైతులు తమ పంటను అమ్ముకొనుటకు తప్పని సరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలకు సభ్యులుగా గల జిల్లా స్థాయి అదికారులందరూ తప్పని సరిగా హాజరుకావాలన్నారు. నెలలో మొదటశుక్రవారంలో రైతుభరోసా కేంద్రాల స్థాయిలోను,రెండవ శుక్రవారం మండల స్థాయిలో జరిగే సలహా మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను, తీర్మానాలను తప్పని సరిగా పంపించాలని వాటిని జిల్లా స్థాయిలో అమలు చేయగలిగినవి చేసి, మిగిలిన వాటిని పరిష్కారం నిమిత్తం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. నీటి పారుదల శాఖలు పంటలకు సకాలంలో నీరు విడుదలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, ప్రోజెక్టుల నుండి నీటి విడుదల సమాచారాన్ని జిల్లావ్యవసాయసలహామండలి చైర్మన్,సభ్యులకు ముందస్తుగా అందించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ వ్యవసాయ మరియు అనుబంధశాఖల నివేదిక సమర్పిస్తూ జిల్లాలో గుమ్మలక్ష్మీపురం మండలం మినహా మిగిలిన మండలాలో సాధారణ వర్షపాతం నమోదయిందని తెలిపారు. జిల్లా లక్షా డబ్బది ఏడు ఎకరాల వరి సాగు లక్ష్యంగా 25వేల క్వింటాలు విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుతానికి లక్షా పదమూడువేల ఎకరాలలో నాట్లు పూర్తయినాయని ఈ

నెలాఖరుకు లక్ష్యం మేరకు వరినాట్లు పూర్తవుతాయన్నారు. జిల్లాకు 45వేల మెట్రిక్ టన్నులు ఎరువులు కేటాయించగా 34 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చాయని, 24 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ జరిగిందని, 9వేల టన్నులు ఎరువులు నిల్వఉన్నాయని, ఎరువులు పొందనిరైతులు వెంటనే వారి రైతుభరోసా కేంద్రాల ద్వారా పొందాలని తెలిపారు. మండలాలలో జరిగిన సలహామండలి సమావేశాలలో వ్యక్తిగత పనిముట్లు సరఫరా చేయాలని, ధాన్యం సేకరణలో దగ్గర మిల్లులకు టాగింగు చేయాలని, రైతుభరోసా భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని, వ్యవసాయయాంత్రీకరణకు వ్యక్తిగతంగా పరికరాలు సరఫరాచేయాలని, సూక్ష్మపోషకాలు, టార్పాలిన్లు, బిందుసేద్యం పరికరాలు సరఫరా చేయాలని, గడ్డి విత్తనాలు సరఫరా తదితరాలు కోరుతూ తీర్మానాలు చేసి పంపించారని, తీర్మానాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, మిగిలిన వాటిని జిల్లా స్థాయి మండల దృష్టికి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తున్నదని, పంట నమోదులో ప్రకృతి పంటను విడిగా నమోదు చేస్తున్నారని తెలిపారు.గ్రామ స్థాయి సమావేశాలకు సభ్యులందరూ హాజరుకావాలని, చెరువులలో ఆక్రమణలు తొలగించి ఆయకట్టు భూములకు నీరు అందించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రాధాన్యత కల్పించాలని, ఐ.టి.డి.ఎ. పరిధిలో పండించే పంటలను అమ్ముకొనుటకు విశాఖపట్నం రైతుబజార్లలో స్టాల్ ను కేటాయించుటకు చర్యలు తీసుకోవలసినదిగా సభ్యులు కోరారు. ఈసలహా సంఘ సమావేశంలో సభ్యులు పారినాయుడు, ఎస్. జనార్ధనరావు, నరశింహమూర్తి, జిల్లా కోపరేటివ్ అదికారి సన్యాశినాయుడు, జిల్లా ఉద్యానఅదికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా మత్స్యశాఖఅధికారి తిరుపతయ్య, ఇతర శాఖల అదికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి నిధులు విడుదల చెయ్యాలి : ఎస్ఎఫ్ఐ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మెంటాడ మండలంలో కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ భవన నిర్మాణ శంకుస్థాపనకి జిల్లాలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన జిల్లా విద్యార్థులను నిరాశపరిచిందని,రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకున్నారే తప్ప జిల్లా విద్యారంగ అభివృద్ధి కోసం,విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి జరగలేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సీహెచ్.వెంకటేష్,పి.రామ్మోహన్ రావులు అన్నారు.జిల్లాలో నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూయించి,దూరాన ఉన్న హై స్కూల్ కి పంపించి,ఎంతో మంది పేద,బడుగు,బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరం అయితే జగన్మోహన్ రెడ్డి తన ప్రసంగంలో గొప్పగా చెప్పుకోవడం సామాన్యుల నోట్లో మట్టికొట్టినట్లే అయిందని మండిపడ్డారు.మరోపక్క విభజన హామీలలో ఉన్న గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు రప్పించడంలో,నిర్మాణం చేపట్టడంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.ఇంకా మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామనడం ఈ జిల్లాలో గిరిజన విద్యార్థుల బ్రతుకులతో ఆటలాడటమే అని,తక్షణమే శంకుస్థాపన చేసిన భవన నిర్మాణ పనులు వేగవంతం చెయ్యాలని,అందుబాటులోకి తేవాలని కోరారు.ప్రపంచస్థాయి విద్య అందిస్తున్నామని చెబుతూనే ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కాలేజీలను అభివృద్ధి చేయకుండా,టీచర్లని ఇవ్వకుండా,బకాయిలో ఉన్న అమ్మఒడి,విద్యావసతి దీవెన బకాయిలను ఇవ్వకుండా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా,మధ్యాహ్న భోజనం పెట్టకుండా దోబూచులాడుతూ సామాన్యులకు అన్యాయం చేసి ప్రైవేట్ శక్తులను,సంస్థలను ప్రోత్సహిస్తుందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించుకుంటే రానున్న కాలంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

అంటిపేటలో పారిశుధ్య కార్యక్రమాలను అధికారుల పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా నిర్వహి స్తున్న పారిశుధ్య కార్యక్రమాలను ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపి ఆర్డీ వర్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టరు శిరీషలు శుక్రవారం సందర్శన చేశారు. గ్రామాల్లోని అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా కాలువల్లో స్ప్రేయింగ్ చేయించారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ శశిభూషణరావు,సచివాలయం వైద్య సిబ్బంది కుమారి తదితరులు పాల్గొన్నారు.

పొలం పనిలో జరిగిన వాదనలో వ్యక్తిపై దాడి

విశాలాంధ్ర-బెలగాం : పొలం పనిలో జరిగిన వాదనలో వ్యక్తిపై దాడి చేయడంతో గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం వనజ గ్రామానికి చెందిన జన్ని మాధవరావు వ్యవసాయ కూలిగా పని చేసుకొంటున్నాడు. అడ్డాకుల కేశవరావు యొక్క పొలంలో ఉడుపుకి ఆకు కట్టలు వేయడానికి ఆరిక తిరుపతిరావు, పాలక మోహనరావు మరికొంతమందితో కలసి కూలి పనికి వెళ్ళాడు. అక్కడ పొలంలో అందరూ ఆకు కట్టలను పొలం చుట్టూ విసరే క్రమంలో ఆరిక తిరుపతిరావు ఒరే మాధవరావు ఆకు కట్టలు అటు విసరకు, ఇటు విసరురా అని అజెమాయిసీ చేసి చెప్పగా ఇద్దరి మధ్య వాదన జరిగి నాకే ఎదురు చెబుతావురా అని తిరుపతిరావు తన రెండు చేతులతో మాధవరావుకు పిడికిలి గుద్దులు గుద్ది, క్రింద పడవేసి తన్ని నిన్ను ఇక్కడ చంపివేస్తే నీకు దిక్కు ఎవర్రా అని భయపెట్టాడు. ఈసంఘటనలో మాధవరావుకు కవుకు గాయాలయ్యాయి. గమనించిన అతని బావమరిది పోలిరాజు జిల్లా ఆసుపత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

నేత్ర దానం పై అవగాహన సదస్సు

నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి

విశాలాంధ్ర-కురుపాం: అవయవ దానాల్లో అన్నింటికీ నేత్రదానానికి అధిక ప్రాముఖ్యత ఉందని, ఆప్తాలమిక్ అదికారి జి.నగేష్ రెడ్డి పేర్కొన్నారు. శరీరం లో ఏ అవయవానికి భాధ కలిగించిన ఆ బాధ ను కళ్ళే వ్యక్త పరుస్తూ వుంటుంది. " సర్వేంద్రీయానాం నయనం ప్రధానం " అనే సూక్తి అందరికీ తెలిసిందే. జాతీయ నేత్ర దాన పక్షో త్సవాలు (ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వ తేదీ వరకు) జరుగుతున్న సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం లో నేత్ర వైద్యాధికారి జి.నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో నేత్ర దానం పై శుక్రవారం అవగాహన సదస్సు, నేత్ర పరీక్షలు నిర్వహించి నేత్ర దానం ప్రాముఖ్యత, ఎప్పుడు చేయాలి ఎక్కడ చేయాలి, ఎవరికి సమాచారం ఇవ్వాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అత్యధిక మంది స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు వచ్చే విధంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్రృషి చేస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో రోగులకు నేత్ర పరీక్షలు జరిపి పలువురు కి కళ్ల జోళ్లు కోసం సిఫార్సు చేసి ఉచితంగా అందచేయటం జరుగుతోంది.ఈ కార్యక్రమంలో సహాయకులు మాలిక, శైలజ,రోజా పాల్గొన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ మన్యం జిల్లా కార్యదర్శిగా తోట సింహాచలం



విశాలాంధ్ర-సీతంపేట: పాలకొండ నియోజక వర్గం పరిధిలో భామిని మండలం కు చెందిన తోట సింహాచలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తనను ఎంపిక చేయడం రెట్టింపు సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ అభివృద్ధికి కోసం జిల్లాలో ఉన్న వైసీపీ నాయకులు అందరిని కలుపుకొని ముందుకు వెళ్తానని తెలిపారు. అదేవిధంగా భామిని మండలం ఎంపీపీగా తన సతీమణి తోట శాంతి కుమారి తమ తల్లి సరస్వతమ్మ కాట్రగడ సర్పంచ్ ప్రజా సేవ చేస్తున్నారని తెలిపారు. తనకు వైసీపీ పార్టీలో ఈ విధమైన గుర్తింపుకు ప్రోత్సహించిన పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో రహదారుల పరిస్థితి అధ్వానం

మాజీ ఎంపీపీ కత్తి చంద్రశేఖర రావు

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ మండలం, చొల్లంగిపేట గ్రామం లోని గ్రామ సచివాలయం, అంగన్వాడి కెంద్రం , ప్రభుత్వ పాఠశాల వంటి ముఖ్య ప్రదేశాలు కలిగిన ప్రదాన కూడలి యొక్క దుస్థితిని డెంకాడ మండలం మాజి ఎంపీపీ కంది చంద్రశేఖర శుక్రవారం పరిశీలించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రహదారులన్నీ హస్తవ్యస్తంగా తయారయ్యాయని గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ గుంటలతో జలమయమయి చాపల బజారు వరి నాట్లకు ఉపయోగించే చెరువులు తలపిస్తున్నాయని ఈ దుస్థితికి వైసీపీ ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు గత ప్రభుత్వంలో 80 లక్షల రూపాయలతో జి ఆర్ పాలెం వరకు వేయించిన తార్ రోడ్ ని ఈ ప్రభుత్వంలొ చెత్త రాబీస్ తో ఏవిధంగా మరమ్మతులు చేసే స్థితికి తీస్కొచ్చారో వివరించారు. అధ్వానంగా మారిన ప్రధాన రహదారి వల్ల ప్రజలు ఆనేక ఇబ్బందులు పడుతున్నారని అవేమి ఈ ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో సంబంధిత అధికారులతో మాట్లాడి తేల్చుకుంటామని, చెలనం లేని ప్రభుత్వం స్పందించని యెడల ప్రతిపక్ష హెూదాలో ఉన్నా ప్రజలకు ఎల్లప్పుడు తోడుగా ఉండే నినాదంతొ ముందుకు వెళ్తా సంబంధిత రోడ్ మరమ్మతులు తామే చేయించి ప్రజలకు అండగా ఉంటామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, మాజీ నీటి ఆనకట్ట ఛైర్మెన్ కలిదిండి రంగరాజు చొల్లంగిపేట గ్రామ పార్టీ అధ్యక్షులు బగ్గ లక్ష్మణ్ రావు చొల్లంగిపేట టీడీపీ నాయకులు యడ్ల సూరిబాబు నగరపేట సూరిబాబు మహంతి శ్రీను బగ్గ రామారావు తదితర నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో కుటుంబ వైద్య శిభిరం

విశాలాంధ్ర-సీతానగరం: మండలం లోని సీతానగరం పిహెచ్ సి పరిధిలోని అప్పయ్యపేట గ్రామంలో శుక్రవారం కుటుంబ వైద్యశిభిరంను వైద్యులు ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో పలువురుకి తనిఖీలు నిర్వహించి మందులు అందజేసారు. పలువురుకి షుగర్, బ్లడ్ తనిఖీలు నిర్వహించారు.వాతావరణంలో మార్పులు ఏర్పడినందున ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ఎంపిటిసి బురిడి కుసుమ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, 104సిబ్బంది పాల్గొన్నారు

శ్రీ కనకమహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : శ్రావణమాసం శుక్రవారం శ్రీ వరలక్ష్మీ వ్రత పర్వదినం సందర్భంగా పట్టణంలోని సిటీ బస్టాండ్ దరి శ్రీ కనకమహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి ఆలయ వ్యవస్థాపకులు, అర్చకులు వికె.గాయత్రిశర్మ పాలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు జరుపుకున్నారు. భక్తులు అవనాపు విజయ్, భార్గవి దంపతులుచే ఆలయం వద్ద, పట్టణంలో ను అన్నదానం నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి వారికి అరటిపండ్లు తో అలంకరణలు గావించారు.

బస్సులన్నీ సీఎం సభకే తరలిస్తే... మా పరిస్థితి ఏంటి ?

ప్రయాణికుల మండిపాటు కాంప్లెక్స్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సీఎం జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా విజయనగరం, ఎస్ కోట, పార్వతీపురం, విశాఖపట్నం డిపోల నుండి సుమారు 300 బస్సులను ఉపయోగించడంతో శుక్రవారం సాయంత్రం విజయనగరం కాంప్లెక్స్ లో బస్సులు లేక పార్వతీపురం మన్యం జిల్లాలకు ప్రయాణికులు వెళ్లడానికి తీవ్ర అవస్థలు పడ్డారు . దీంతో తీవ్ర అసహనానికి గురై ప్రయాణికులంతా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నాకు దిగారు. అన్ని బస్సులూ సీఎం సభలకు తరలించుకుంటూ పోతే ప్రయాణికుల గోడు పట్టించుకోరా అని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఆర్టీసీ వద్ద తీవ్ర ట్రాఫిక్ జామ్ అయింది. ఎలాగైనా తమ గమ్యస్థానాలకు చేర్చాలని ఆర్టీసీ అధికారులను కోరారు. దీనితోడు ముఖ్యంగా శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో ప్రయాణికులంతా తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల కోసం బస్సులను ఏర్పాటు చేసింది. సీఎం రాక సందర్భంగా గ్రామదేవతల పండగల నేపథ్యంలో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న ఆర్టీసీ సిబ్బంది సామాన్య ప్రయాణికుల కోసం కూడా ఇకమీదట పట్టించుకోవాలని ఆశిద్దాం.

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

- రెట్టింపు ఛార్జీలు వసూలుచేసిన ప్రైవేటు వాహనదారులు

విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు ప్రజలను తరలించేందుకు సుమారు 300 బస్సులను అధికారులు కేటాయించారు. వాటిలో విజయనగరం నుండి 40, ఎస్ కోట 20, పార్వతీపురం పాలకొండ డిపోల నుండి 110, శ్రీకాకుళం 50 విశాఖపట్నం నుండి 80 సర్వీసులను తిప్పడంతో సామాన్య ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి కాక తప్పలేదు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడం వివిధ జిల్లాలలో ఉన్న ఆడవారంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకునేందుకు బస్సుల్లో ప్రయాణం చేయడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వృద్ధులు ,వికలాంగులు ,బాలింత స్త్రీలు, శుక్రవారం ప్రయాణాలు మానుకోవాల్సి వచ్చింది. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులు లేక వెలవెల పోవడంతో ప్రయాణికులంతా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులు లేవన్న విషయాన్ని తెలుసుకున్న ప్రైవేటు వాహనదారులు ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేర్చేందుకు రెట్టింపు చార్జీలు వసూలు చేశారు. సీఎం రాకలకు, గ్రామ దేవత పండగలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్న ఆర్టీసీ సామాన్య ప్రయాణికుల కోసం పట్టించుకోవడంలేదని పలువురు అంటున్నారు.